క్లుప్తంగా

సాగర తీరంలో చల్ల చల్లగా..



రుషికొండ బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: ఉదయం నుంచి ఉక్కపోత, గాలి లేక ఎర్రటి ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు సాయంకాలం సాగరతీరాన్ని ఆశ్రయించారు. మంగళవారం భానుడు భగభగమంటూ నిప్పులు కక్కడంతో గంటల తరబడి సముద్ర తీరంలో స్నానాలు చేసేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరిచారు. భీమిలి, సాగర్‌నగర్, రుషికొండ బీచ్‌లో పర్యాటకుల తాకిడి పెరిగింది.

భీమిలి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

తగరపువలస: భీమిలి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా ఎస్.జనార్దనరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి సరగడ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 2023 – 2024 సంవత్సరానికి సంబంధించిన ఎన్నిక భీమిలిలో మంగళవారం నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్‌గా కె.మంజుల, కార్యదర్శిగా నమ్మి సూరిబాబు, సహాయ కార్యదర్శిగా బి.సూర్యప్రకాష్‌రెడ్డి, కోశాధికారిగా ఎం.సునీల్, ఎగ్జిక్యూటివ్ ప్రతినిధులుగా బి.అప్పలరాజు, వి.అరుణకుమారి, వై.నరసింగరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని స్థానిక న్యాయవాదులు అభినందించారు.

బకాయిలపై ఎమ్మెల్యేతో 12న భేటీ

తగరపువలస: చిట్టివలస యాజమాన్యం నుంచి కార్మికులకు రావాల్సిన బకాయిలపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో ఈ నెల 12న చర్చించనున్నట్లు ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు. కాంగ్రెస్ కార్మిక సంఘ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దల్లి అప్పలరెడ్డి, టీఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు రైళ్లు ఆలస్యం

తాటిచెట్లపాలెం : షాలిమార్‌లో మే 9న మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమార్ – చెన్నై (12841) కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.20గంటలకు బయల్దేరింది. 9న చెన్నై సెంట్రల్‌లో రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 7.15కు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ – హౌరా(12840) మెయిల్ మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 10.05గంటలకు బయల్దేరుతుంది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు ఇవి చేరుకోనున్నాయి.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఫోర్తు టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కేరళకు చెందిన శ్యామ్‌దాస్, అవినాష్.. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి విశాఖ రైల్వేస్టేషన్ పోస్టు ఆఫీస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. ఆటు వైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు వారిని పట్టుకుని విచారించగా.. 8 కిలోల గంజాయి గుర్తించారు. ఫోర్తు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు

గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేట దరి షిర్డీసాయిబాబా ఆలయం సమీపంలోని ఒక ఇంటి మేడపై ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారంతో ద్వారకా ఎస్‌ఐ అప్పలరాజు, టాస్క్‌ఫోర్సు ఎస్‌ఐ రమణ దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి పౌడర్‌తో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

భూములిచ్చిన రైతులందరికీ న్యాయం

- 30 లక్షల ఇళ్లు మంజూరు చేసిన సీఎం జగన్
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నరసాపురంలో రైతులకు ఎల్‌పీవోసీలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన రైతులందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నరసాపురంలో 98 మంది రైతులకు మంగళవారం ఆయన ఎల్‌పీవోసీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగదన్నారు. నేరెళ్లవలసలో లే అవుట్ వేసి 138 మంది రైతులకు ఆర్‌సీ ప్లాంట్లు కేటాయించినట్టు తెలిపారు. ల్యాంగ్ పూలింగ్‌కు సంబంధించి ఇంకా ఎవరికైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల మందికి జగనన్న కాలనీ ఇళ్లు మంజూరు చేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. దేశంలో ఏ సీఎం కూడా ఇంత పెద్ద మొత్తంలో కాలనీ ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. విశాఖపట్నం నుంచి భీమిలి బీచ్ మీదుగా భోగాపురంలో ఏర్పాటు చేయనున్న ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు వరకు ఆరులైన్ల రోడ్డు నిర్మిస్తారన్నారు. దీనివల్ల విశాఖపట్నం టౌన్, భీమునిపట్నం జంట నగరాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగానే పద్మనాభం మండలం రూపు రేఖలు మారిపోతాయన్నారు. విశాఖపట్నం జిల్లాలో ఒక్క పద్మనాభం మండలంలోనే భూములున్నాయన్నారు. భూముల విలువ పెరుగుతున్నందున రైతులు భూములను అమ్ముకోవద్దన్నారు. రాబోయే రోజుల్లో పద్మనాభం మండలానికి మహర్దశ పట్టనుందన్నారు. తాను నిత్యం ప్రజలకు సేవకుడిగా ఉంటానన్నారు. నరసాపురంలో సంక్షేమ పథకాల రూపంలో రూ.4.85 కోట్లు, అభివృద్ధి రూపంలో రూ.7.96 కోట్లు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, తహసీల్దార్ తోట శ్రీవల్లి, సర్పంచ్ సుంకర పైడిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర బంగారప్పడు, బుగత సత్యనారాయణ, పాల్గొన్నారు.

యంత్ర సేవా కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



నూర్పిడి యంత్రాన్ని గ్రూపు సభ్యులకు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

ఆనందపురం : రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ కోరారు. మంగళవారం లొడగలవానిపాలెం, కుసులువాడ యంత్ర సేవా కేంద్రాలకు యంత్ర పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నూర్పిడి యంత్రం రూ.80 వేలు రాయతీతో, కలుపుతీత యంత్రాలను రూ.20 వేలు రాయతీతో అందిస్తున్నామన్నారు. మిగతా మొత్తం బ్యాంకు రుణం ద్వారా మంజూరు చేస్తున్నామని, వాయిదాల రూపంలో చెల్లించుకోవాల్సి ఉంటుందని వివరించారు. కుసులువాడకు నూర్పిడి యంత్రం, లొడగలవానిపాలెం రైతులకు మూడు కలుపుతీత యంత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ వేణుగోపాల్, సచివాలయాల వ్యవసాయాధికారులు, యంత్ర సేవా కేంద్రాల చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

బైక్ డూమ్‌లో పాము



బైక్ డూమ్‌లోకి చేరిన పాము

కొమ్మాది: బైక్ తీసి బయటకు వెళ్దామని సిద్ధమయ్యేసరికి డూమ్‌లో పామును చూసి అవాక్కయ్యాడు ఓ యువకుడు. జీవీఎంసీ 4వ వార్డు చిన ఉప్పాడకు చెందిన రమేష్ మంగళవారం ఉదయం భీమిలి వెళ్లడానికి తన బైక్‌ను తీసి శుభ్రం చేస్తున్న సమయంలో బైక్ లైట్ (డూమ్)లో పామును చూసి ఒక్కసారిగా ఆందోళన చెందాడు. సుమారు 4 అడుగులు ఉండే పాము డూమ్‌లోకి ఎలా చేరిందో తెలియక, దానిని ఎలా బయటకు పంపాలో అర్థం కాక కాసేపు సతమతమయ్యాడు. చేసేదేమీ లేక ఆ బైక్‌ను ఓ గంటపాటు ఇంటి వద్ద వదిలివేయడంతో ఆ పాము నెమ్మదిగా బయటకు జారుకుంది. దీనిని పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌తో రామవరం విద్యార్థులు

ఆనందపురం : వేసవి సెలవులల్లో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉండడానికి ప్రభుత్వం సమ్మర్ క్యాంప్ మెటీరియల్ పంపిణీ చేస్తోంది. దీంతో సెలవుల్లో కూడా విద్యార్థులకు విద్యపట్ల ఆసక్తి పెంపొందించడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు మెటీరియల్‌ని అందజేస్తున్నారు. ఆ మెటీరియల్‌లో డ్రాయింగ్, మ్యాపింగ్, విజ్ఞానానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. విద్యార్థులతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో రోజుకొక అంశంపై అధికారులు విద్యార్థులకు కృత్యాలు నిర్దేశిస్తారు. ఆ మేరకు విద్యార్థులు తమ దగ్గర ఉన్న మెటీరియల్‌తో కృత్యాలు పూర్తి చేస్తారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే రోజున ఉపాధ్యాయులు ఆ మెటీరియల్ తీసుకొని విద్యార్థుల ప్రతిభను అంచనా వేస్తారు. మండలంలో గల అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు మెటీరియల్‌ని అందజేస్తున్నారు.

షిప్‌యార్డు లే అవుట్‌లో లైట్లు వెలగక అవస్థలు



పీఎం పాలెం షిప్‌యార్డు లే అవుట్‌లో అంధకారంలో ఓ వీధి

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం ఆఖరి బస్టాప్ షిప్‌యార్డు లే అవుట్‌లో కొన్ని వీధుల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో చాలా ప్రాంతాలు అంధకారంలో ఉంటున్నాయి. శివారు ప్రాంతం కావడంతోపాటు ఎక్కువగా తుప్పలు, డొంకలు ఉండడంతో రోడ్ల వెంబడి చీకటిగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుప్పలు, డొంకలు లోనుంచి పాములు, ఇతర విష పురుగులు ఎప్పుడు వచ్చి కాటేస్తాయోనని పాదచారులు, స్థానికులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతం అంధకారంగా ఉన్న కారణంగా తరచూ చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారని వాపోతున్నారు. కొన్నిచోట్ల చిన్నపాటి మరమ్మతులు చేపడితే లైట్లు వెలిగే పరిస్థితి ఉన్నా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి అవకాశం ఉన్నచోట మరమ్మతులు చేపట్టాలని, లైట్లు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలకు పాలన చేరువ చేసిన సీఎం జగన్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సింహగిరి కాలనీలో అధికారులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తాటిచెట్లపాలెం: అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల చెంతకే పాలన చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిన వైఎస్ జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని ఆయన కోరారు. జీవీఎంసీ 45వ వార్డు, భీమిలి నియోజకవర్గం పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకుతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. సింహగిరి కాలనీలో పలు చోట్ల ఓపెన్‌గా ఉన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు ఆయన సూచించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు వెంటనే వీధి లైట్లు వేయాలని అధికారులకు చెప్పారు. శిథిలావస్థలో ఉన్న బాల్యం భవనం విషయంపై ఆరా తీశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల వల్ల కలుగుతున్న లబ్ధిని ప్రజలకు వివరించారు.

దేవస్థానం భూ సమస్యకు త్వరలో పరిష్కారం

సింహాచలం దేవస్థానం భూ సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని ముత్తంశెట్టి తెలిపారు. సమస్య కోర్టు పరిధిలో ఉండడం వల్ల ఏమీ చేయలేకపోతున్నామని, అయినా ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి పరిష్కారం కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న గాజువాక హౌస్ కమిటీ సమస్యను ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించారని, అలాగే ఈ సమస్య కూడా త్వరలోనే శాశ్వతంగా పరిష్కారమవుతుందని తెలిపారు. జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాలైన సింహగిరికాలనీ, సింగాలమ్మపురం, సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ–1, 2 తదితర ప్రాంతాల్లో చాలా మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టి సుమారు 30 సంవత్సరాలు అవుతుందని, ఇవి శిథిలావస్థకు చేరాయని, కనీసం మరమ్మతులకైనా అనుమతులివ్వాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గురు అమ్మవార్ల పండగ



ఆలయంలో ముగ్గురు అమ్మవార్లు

మధురవాడ: కొమ్మాది కూడలిలోని మధురవాడ పరిసర 14 గ్రామాల ఆరాధ్య దేవతలు ముగ్గురు అమ్మవార్ల పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఇక్కడ కొలువైన త్రిశక్తి ఆలయంలోని బంగారమ్మ, ఎర్నమ్మ, దండుమారమ్మ అమ్మవార్లని కొమ్మాది పరిసర గ్రామాలతోపాటు నగరంపాలెం, మల్లయ్యపాలెం, చంద్రంపాలెం, మధురవాడ నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

శాకాంబరిగా కొత్తమ్మతల్లికి అలంకరణ



శాకాంబరి అలంకరణలో సంతపేట కొత్తమ్మ తల్లి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, కొత్తపేట తదితర గ్రామాల ఆరాధ్య దేవత కొత్తమ్మతల్లిని ఔత్సాహికులు మంగళవారం ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించి శాకాంబరిగా భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేశారు. రాయల్ యూత్ ఆధ్వర్యంలో దుంప సూర్యకాంతం, గాబు సంతోషి, చేట్ల అప్పలస్వామి, పత్రి ఈశ్వరరావు అమ్మవారి అలంకరణకు అవసరమైన సామగ్రి సమకూర్చారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి, చిట్టిబాబు అమ్మవారి అలంకరణ సేవలో పాల్గొనగా కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని అభినందించారు.

రేషన్ డిపోపై డిప్యూటీ కలెక్టర్ విచారణ



డీలర్ వెంకటరమణను విచారిస్తున్న డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ రాణి సుష్మిత

తగరపువలస: డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ రాణి సుష్మిత సంతబయలులోని 15వ నంబర్ రేషన్ డిపోపై మంగళవారం విచారణ చేపట్టారు. ఇటీవల డీలర్ ఉప్పల చిన వెంకటరమణ కుమారుడు రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు ఆమె విచారణకు వచ్చారు. గతంలో డోర్ నంబర్ 5 – 48 – 38లో ఉన్న రేషన్ డిపో ప్రస్తుతం అనధికారికంగా 6 – 45 – 185లో నిర్వహిస్తున్నందున డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రమేష్‌బాబు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆమె చినవెంకటరమణను సదరు ఫిర్యాదుపై ప్రశ్నించగా పాత డోర్ నంబర్‌లో ఉన్న రేషన్‌డిపో భవనం తన కుమారుడు రమేష్‌బాబు విక్రయించగా కొత్త డోర్ నంబర్ వద్ద డిపో నడుపుతున్నట్టు తెలిపారు. డిపో చిరునామా మార్పునకు ఈ ఏడాది మార్చి 5న పౌరసరఫరాల శాఖ, భీమిలి రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశామన్నారు. అలాగే ఈ పాస్ యంత్రంతో పోలిస్తే డిపోలో భౌతికంగా 1025 కిలోల బియ్యం తక్కువ ఇస్తున్నట్లు ఆమె దృష్టికి డీలర్ తీసుకొచ్చారు. సాంకేతిక కారణాలతో తేడాగా ఉన్న బియ్యాన్ని ఈ పాస్ యంత్రాల్లో కూడా సరిచేయాలని 2021 నవంబరులో ఫిర్యాదు చేశామన్నారు. దీనికి సంబంధించిన పత్రాలతోపాటు, ఇప్పుడున్న డిపోను అదే స్థానంలో ఉప్పల చిన వెంకటరమణతో నిర్వహించాలని ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ పత్రాలను ఆమెకు సమర్పించారు. దీంతో ఆమె వెళ్లిపోయారు. పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారావు, వీఆర్వోలు బి.గీత, శివాని పాల్గొన్నారు.

చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ



మిథిలాపురి వుడా కాలనీలో దివ్యాంగునికి మజ్జిగ తాగిస్తున్న సభ్యులు

మధురవాడ: వేసవి ఎండలు మండిపోతుండడంతో జీవీఎంసీతోపాటు పలు ఆధ్యాత్మిక సంస్థలు, పౌర సంఘాలు విస్తృతంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారులు, వాహనదారులకు మజ్జిగ, నీరు అందిస్తున్నారు. మిథిలాపురి వుడా కాలనీలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎం.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు.

చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం ప్రాంగణంలో కెనడాలో స్థిరపడిన తగరపువలస వాసి లింగబత్తు అనీల్ కుమార్, సునీత దంపతుల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. మధురవాడ ప్రధాన కూడలి హైస్కూల్ వద్ద పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాగోతి శింగన్న జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆ సంఘం నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు.

కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్ల వితరణ

దాబాగార్డెన్స్: సింహాద్రి టీఎంటీ, హిమ హ్యూమానిటేరియన్ సంస్థ కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్లను సమకూర్చాయి. వాటిని హిమ హ్యూమానిటేరియన్ చైర్మన్ బీఎస్ మూర్తి, సింహాద్రి టీఎంటీ డైరెక్టర్ వి.వి.కృష్ణారావు కేజీహెచ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఏఆర్ఎంవో డాక్టర్ అరుణదేవికి అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ 32 ఏళ్లుగా హిమ హ్యూమానిటేరియన్, సింహాద్రి టీఎంటీ కేజీహెచ్‌కు అందజేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. మరెన్నో సేవా కార్యక్రమాలు అందించాలని ఆకాంక్షించారు. మాజీ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పైల సన్నిబాబు, ఏఆర్ఎంవో డాక్టర్ అరుణదేవి, డాక్టర్ జగదీష్, మీసాల రామకృష్ణ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సులోచన, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, పల్లా ఆనంద్, కేవీ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జులాయిలకు అడ్డాగా చిల్డ్రన్స్ పార్క్



పార్కు ఆవరణలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు



శిథిలమైన పార్కు గేట్లు



గొల్లవీధి వైపు కూలిన పార్కు ప్రహరీ

- చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలు
- పోలీసులు నిఘా పెంచాలంటున్న స్థానికులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేట గొల్లవీధిని అనుకుని ఉన్న చిల్డ్రన్స్ పార్క్ చీకటి పడితే జులాయిలకు అడ్డాగా మారిపోతోంది. భీమిలి మున్సిపాల్టీ పాలకవర్గం 2000 సంవత్సరంలో చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి చేసి తర్వాత దానికి ఎన్టీఆర్ పార్కుగా నామకరణం చేసింది. ఈ పార్కు ఆవరణలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలతోపాటు రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, వ్యాయామశాలలు నడుస్తున్నాయి.

పార్కులో ఏర్పాటు చేసిన చిన్నపిల్లల ఆట వస్తువులు శిథిలమైపోవడం, తుక్కుగా మారిపోవడంతో ఆకారం కోల్పోయింది. పూర్తిగా ప్రహరీ లేకపోవడం, పాక్షికంగా ఉన్న ప్రహరీ ఆకతాయిల చేష్టలతో కూలిపోవడంతో జులాయిలకు కేంద్రంగా మారిపోయింది. ఇదే పార్కులో అనధికారంగా నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ కోర్టు తప్ప మిగతా ప్రాంతమంతా చీకటిపడితే జుగుప్సాకర వాతావరణంతో నిండిపోతోంది. పార్కు నుంచి కొండవాలు ప్రాంతంలో తపస్సు చేస్తున్న శివుని విగ్రహం వరకు మందుబాబుల ఆగడాలతో చుట్టుపక్కల వారు అవస్థలు పడుతున్నారు.

రాత్రి 10 తర్వాత అరుపులు, కేకలు

తగరపువలస, చిట్టివలస పరిసర ప్రాంతాల నుంచి యువత సాయంత్రం 8 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు పార్కులో తిష్టవేస్తున్నారు. పార్కులో ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా ఏర్పాటు చేసిన గేటును విరగ్గొట్టేశారు. గొల్లవీధి వైపు కూడా ప్రహరీని కూలివేశారు. మద్యం, గంజాయి సేవనం వంటి పనులకు పార్కులో బెంచీలు, స్కూల్, అంగన్‌వాడీ పరిసరాలను వినియోగిస్తున్నారు. వీరిలో టీనేజ్ ఆడపిల్లలు కూడా ఉండటం గమనార్హం. సాయంత్రం 8 నుంచి అర్ధరాత్రి 12 వరకు యువతీయువకులు ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్‌తో సంతపేట పరిసర వీధులను హోరెత్తిస్తున్నారు. నిర్లక్ష్యంగా, వేగంగా వాహనాలు నడుపుతూ కేకలు వేసుకుంటూ చుట్టుపక్కల నివసిస్తున్న వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. గంజాయి మత్తులో పెద్దగా అరుస్తూ ఒంటరిగా వెళ్లేవారిపై దాడులకు దిగుతున్నారు. జీవీఎంసీ పార్కుకు రక్షణగా ప్రహరీని పటిష్టం చేయడంతోపాటు భీమిలి పోలీసులు ఈ పార్కులో సాయంత్రం నుంచి నిఘా ఉంచి ఆకతాయిల భరతం పట్టాలని స్థానిక నివాసులు కోరుతున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



ఇతర ప్రాంతాల నుంచి యువతీ యువకులు ఈ పార్కును అడ్డాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. జీవీఎంసీ ప్రహరీ గోడకు మరమ్మతులు నిర్వహించి గేట్లను పునరుద్ధరించాలి. భీమిలి పోలీసులు నిఘా పెంచాలి.

– చిప్పాడ వెంకటేష్, వైఎస్సార్‌సీపీ 2వ వార్డు ప్రధాన కార్యదర్శి

పబ్లిక్ డిమాండ్

నిలిచిన వర్షం నీటితో సమస్యలు

తగరపువలస: పోతినమల్లయ్యపాలెం రామాలయం సమీపంలోని ఎంఐజీ 1541 వద్ద రహదారిపై వర్షం కురిసిన ప్రతీసారి రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది. దీంతో విపరీతమైన దుర్వాసన వచ్చి ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. ఈ నిలిచిన నీటిలో పందులు మలమూత్ర విసర్జన చేస్తున్నాయి. దోమలు వచ్చి చేరుతుండడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఆ రోడ్డు మీద నడవడానికే ఇబ్బందిగా ఉంది. ఈ సమస్యపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ఇప్పటికే ఫిర్యాదు చేశాం. జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి.

– ఓంకార్, 6వ వార్డు, పీఎం పాలెం, మధురవాడ జోన్.



రహదారిపై నిలిచిన వర్షం నీరు